క్లుప్తంగా

నేడు పట్టాల పంపిణీ

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లో 58 జీవో ప్రకారం రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలను అందజేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎస్ఆర్టీ కమ్యూనిటీహాల్‌లో పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ప్రకటించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మండల తహశీల్దార్, ఇతర ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

◆ ముషీరాబాద్ నియోజకవర్గంలోని 6 డివిజన్‌లకు చెందిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. మంగళవారం ఉదయం 12 గంటలకు ముషీరాబాద్ చౌరస్తాలోని మహ్మదీయ ఫంక్షన్‌హాల్‌లో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

బీజేఆర్, అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు



కాచిగూడ: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జయంతి ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. బర్కత్‌పురకు చెందిన భజరంగ్‌దళ్ నేత మర్పల్లి చంద్రకాంత్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన జంగా శ్రీనివాస్‌ను కలిసి ఈ సందర్భంగా అభినందించారు. సోను, నాని, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

లోప్రెషర్ నీటి సరఫరా సమస్య పరిష్కారానికి కృషి



తురాబ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: లోప్రెషర్ తాగునీటి సరఫరా సమస్యను తక్షణమే పరిష్కరించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని తురాబ్‌నగర్, ఎరుకలబస్తీ, కుమ్మరివాడి ప్రాంతాల్లో లోప్రెషర్‌తో నీటి సరఫరా అవుతోందని తెలుసుకున్న కార్పొరేటర్ సోమవారం తెల్లవారు జామున ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్ ఉమా శంకర్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

పదోతరగతి పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి

కవాడిగూడ: పదో తరగతి పరీక్షల్లో మొదటి రోజే పేపర్ లీక్ కావడం దురదృష్టకరమని లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏడాదంతా కష్టపడి చదివి పరీక్షలు రాస్తున్న క్రమంలో ప్రశ్నపత్రం లీకేజీలతో విద్యార్థుల తల్లిదండ్రులు మనోవేదనకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీకి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ మరువక ముందే పదో తరగతి పేపర్ లీక్ కావడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పైసా వసూల్ !

- 75 శాతం పెరిగిన ఆస్తిపన్ను వసూళ్లు
- సర్కిల్–16 లో రూ.43 కోట్ల వసూళ్లు
- కొత్త పన్ను చెల్లింపుదారులను గుర్తించని జీహెచ్ఎంసీ
- పాతవారి నుంచి వసూలు చేసి వదిలేస్తున్న వైనం
- ముందస్తు చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ



ఆస్తి పన్ను చెక్కును తీసుకుంటున్న డీఎంసీ వేణుగోపాల్

అంబర్‌పేట: ఆస్తి పన్ను వసూళ్లలో అధికార యంత్రాంగం 75 శాతం లక్ష్యానికి చేరుకుంది. మార్చి నెల చివరి వరకు ఉన్న గడువు లోపు ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించింది. జీహెచ్ఎంసీ సర్కిల్–16 పరిధిలో ఉన్న అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్‌లతో పాటు అదనంగా ఉన్న హిమాయత్‌నగర్ డివిజన్‌ల ఆస్తిపన్ను ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపుదారుల నుంచి వసూలు చేసింది.

◆ సర్కిల్ –16 గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.53 కోట్ల వసూళ్లకు రూ.43 కోట్లను అధికార యంత్రాంగం వసూలు చేసింది. దీంతో లక్ష్యానికి 75 శాతం చేరామని సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్ ప్రకటించారు.

అభివృద్ధికి సహకరించాలి..

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. భవన యజమానులు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించకపోతే జరిమానా పడుతుంది. ఆస్తి పన్ను చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఈ నెలలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు జీహెచ్ఎంసీ 5 శాతం పన్ను రాయితీ అవకాశం కల్పించింది. ఈ రాయితీ ఈ ఏడాది ముందస్తు పన్ను చెల్లింపుదారులకు మాత్రమే వర్తిస్తుంది.

– డీఎంసీ వేణుగోపాల్, సర్కిల్–16

తెలుగుపాటకు ఆస్కార్ రావడం గర్వకారణం



అశోక్‌గుర్జాలేను సన్మానిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, దీపికారెడ్డి తదితరులు

చిక్కడపల్లి: ఆరభి సంస్థ రజతోత్సవ వేడుకలు త్యాగరాయగానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలుగుజాతి గర్వపడేలా తెలుగుపాటకు ఇటీవల ఆస్కార్ అవార్డు రావడం గర్వకారణమన్నారు. రాజ్యసభలో తెలుగు కళాకారులను పొగడుతుంటే ఎంతో ఆనందంగా ఉందని గానసభ ఎందరో కళాకారులకు అవకాశం ఇచ్చిందన్నారు. సుందరకాండ ఎమ్మెస్ రామారావు గుర్తుగా ఆయన పేరిట ఈ వీధికి ఆయన పేరు పెట్టినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీ20 సమావేశాల్లో ఆరభి కళాకారులకు అవకాశం ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. నిర్వాహకులు అశోక్‌గుర్జాలే, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురాధ, ట్రస్టీ వెంకటసుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఓ డైరెక్టర్ వాసుదేవన్, గోపిశర్మ, రాజేష్, పీఆర్‌సీశర్మ తదితరులు పాల్గొన్నారు. అశోక్‌గుర్జాలే, సంధ్య గుర్జాలే దంపతులను లక్ష్మణ్, ప్రముఖులు, శిష్యబృందం గజమాలతో ఘనంగా సన్మానించారు.

శివాజీ ధైర్య సాహసాలు యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్

కాచిగూడ: ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు యువతకు ఆదర్శనీయమని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ అన్నారు. శివాజీ వర్ధంతి సందర్భంగా సోమవారం కాచిగూడ డివిజన్ శివాజీనగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నేతలు గౌటీ గణేష్, ఆనంద్, రాజు, రాజేందర్, మహేష్, ప్రవీణ్, ప్రణవ్, అభినయ్, అజయ్ తదితరులున్నారు.

రూ.1650 కోట్ల బకాయిలను విడుదల చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా పరిశ్రమలశాఖలో సుమారు రూ.1650 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సీ.హెచ్.బాలకృష్ణ అన్నారు. నవ భారత నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాటు, సచివాలయానికి ఆయన పేరు పెట్టినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ లోన్‌లు నిలిపేయడం సరికాదని దీనిని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. దళిత బంధు పథకాన్ని దళితులందరికీ వర్తింపజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

◆ రాష్ట్రంలో గత 4–5 ఏళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మాణమైనా ఇప్పటి వరకు అర్హులకు కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగంలో భాగంగా అభినయ పద మందారంపై ఈ నెల 7న కృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ ప్రకటించారు. సోమవారం చిక్కడపల్లిలో వాల్‌పోస్టర్‌ను సమన్వయకర్త నిష్టల సుధామాలతో కలిసి ఆవిష్కరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్యశాఖ ఆచార్య డాక్టర్ అరుణాభిక్షు పదాయనంపై ప్రసంగం చేస్తారని వివరించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి రామలింగేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీస్ అకౌంట్స్ వసుంధర, ప్రముఖ నృత్య గురువులు కళాకృష్ణ, భాగవతుల సేతురామ్‌లు తదితరుల హాజరుకానున్నట్లు తెలిపారు. నృత్యగురువులు డాక్టర్ ఇందిరాహేమ, శ్రీలత, తులసి తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల సమస్యలను 40 రోజుల్లో పరిష్కరిస్తాం

ముషీరాబాద్: జెమిని కాలనీలో 40 ఏళ్లుగా ఉన్న సమస్యలను 40 రోజుల్లో పరిష్కరిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమిని కాలనీలో బీఆర్ఎస్ నగర నాయకుడు పూస గోరఖ్‌నాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారిలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 40 ఏళ్లుగా జెమిని కాలనీలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పైపులైన్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొత్త పైపులైన్లను వేసిన అనంతరం సీసీ రోడ్లను వేస్తామన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, దీన్ దయాల్‌రెడ్డి, భాస్కర్, పరశురాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: మూసీ పరివాహక ప్రాంతాల్లో బఫర్ జోన్ ప్రాంత పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట తహసీల్దార్ సీహెచ్ లలితకు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ వినతి పత్రం అందజేశారు. సోమవారం గోల్నాక బస్తీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె గతంలోనూ బఫర్‌జోన్ నమూనా ఇవ్వాలని లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశామని తహసీల్దార్‌కు కార్పొరేటర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా బఫర్‌జోన్ ప్రాంత పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

అలరించిన చంద్రహాస్ ఈవెంట్స్



చిక్కడపల్లి: చంద్రహాస్ మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో 'నాన్నకు ప్రేమతో' పాటల స్వర సంగమం –8 కార్యక్రమం సోమవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సిటీ కల్చరల్ సెంటర్‌లో జరిగింది. బాబీ , వీరభద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రోహిణితో పాటు 15 మంది గాయకులు పాల్గొని పాటలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ప్రముఖులు విజయలక్ష్మి, ఎల్‌పిరావు, రవిబాబు, మోహన్, జేపీ, కె.సుధాకర్, యోగిత అక్కిరాజు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

ముషీరాబాద్: ఇటీవల టీఎస్‌పీఎస్సీ పరీక్షా పేపర్ల లీకేజీ ఓ వైపు ప్రభుత్వాన్ని కుదిపేస్తుండగా తాజాగా పదో తరగతి పరీక్షల మొదటి రోజే ప్రశ్నపత్రం లీకేజీ కావడం చూస్తుంటే పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నామాల ఆజాద్‌లు అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తు విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి..

కాచిగూడ: గతంలో ఎన్నడూ లేని విధంగా పరీక్షల పేపర్లు లీకేజీ అవుతున్నాయని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం జరిగిన పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీకి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్న పత్రం లీకేజీపై సమగ్ర విచారణ చేసి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లీకేజీలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఈ కౌషిక్‌తో కలిసి సోమవారం ఆమె డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. చిలకలగూడ ఫ్రైడే మార్కెట్ సమీపంలోని జీహెచ్ఎంసీకి చెందిన ఖాళీస్థలం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అనువైనదిగా గుర్తించామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్తులో షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, స్నూకర్ తదితర క్రీడలకు సంబంధించి కోర్టులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం పంపనున్నట్లు ఆమె వెల్లడించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఇండోర్ స్టేడియం బ్లూ ప్రింట్‌ను త్వరలోనే సిద్ధం చేస్తామని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేటర్ వెంట వైద్యాధికారిణి ఫణి, సిబ్బంది గీత,రేఖ, సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ అసోషియేషన్ ప్రతినిధి బిట్ల రఘునందన్ ఉన్నారు.

'పరిపక్వత, పరిపూర్ణత సాధించడం సులువు కాదు'



తో బుట్టువులు కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: ఏ రంగంలోనైనా పరిపూర్ణత, పరిపక్వత సాధించడం సులువు కాదని విశేష కృషి అవసరమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్, శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాఖ్యాత లంకా లక్ష్మీనారాయణ, ప్రముఖ గాయని గీతాంజలి, వర్ధమాన రచయిత్రులకు ఆత్మీయ సత్కారం జరిగింది. గుదిబండి వెంకట్‌రెడ్డి 82వ జన్మదినం సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఆయన సంకలనం చేసిన 'తో బుట్టువులు' కవితా సంకలనాన్ని డాక్టర్ రమణ ఆవిష్కరించి మాట్లాడారు. ఎవరున్నా తోబుట్టువు లేకుంటే లోటేనని అన్నారు. ప్రతీ పుట్టిన రోజున వెంకట్‌రెడ్డి కవితా సంకలనాలు తేవటం అభినందనీయమన్నారు. రామారాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, నాట్యగురువు నిర్మలా ప్రభాకర్, జానీభాషా, రాఘవరెడ్డి, పద్మశ్రీలత పాల్గొనగా.. శివ పార్వతి శిష్యబృందం సంగీత విభావరి అలరించింది.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



పైపులైన్ వాల్వ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తదితరులు

కాచిగూడ: తాగునీటి సమస్యతో ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ ఆరోపించారు. నెల రోజుల నుంచి కాచిగూడ డివిజన్‌లోని మోతీమార్కెట్, నింబోలిఅడ్డ, ఇందిరానగర్, రహమత్‌నగర్, చెప్పల్‌బజార్, బండల బస్తీ, మౌలానా ఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి దాకా పరిష్కారం కాలేదన్నారు. సోమవారం జలమండలి జీఎం రామకృష్ణ, ఏఈ భావన, సారిక, మహేందర్ రెడ్డి వెంకటేష్‌యాదవ్, సిబ్బందితో కలిసి పైపులైన్ వాల్వు పనులను పర్యవేక్షించారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, నాయకం రాజు, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, నాగు, వెంకటేష్, దినేష్, రమణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్.గౌతంరావు

కాచిగూడ: తెలంగాణ సాయుధ పోరాటంలో వీర మరణం పొందిన దొడ్డి కొమురయ్య కురుమ చేసిన త్యాగం చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ యాదవ్ అన్నారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 96వ జయంతి సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, బి.వెంకట్‌రెడ్డి పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాం ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు హింసకు గురయ్యారన్నారు.

◆ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన కొమురయ్య జీవిత చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చి ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, వై.అమృత, కన్నె ఉమా రమేష్ యాదవ్, పార్టీ నేతలు కృష్ణగౌడ్, ఎన్.బుచ్చిరెడ్డి, ఎం.బి.కిషోర్‌కుమార్, వెంకటేష్, రమేష్, ప్రణయ్‌సింగ్, వెంకటస్వామిగౌడ్, రాజేష్, నరేష్, ఈశ్వర్, అనిల్‌చారి తదితరులున్నారు.

దోపిడీ, అణచివేతలపై పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య

కాచిగూడ: దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన యోధుడు దొడ్డి కొమరయ్య కురుమ అని తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా అన్నారు. దొడ్డి కొమరయ్య 96వ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన జయంతి వేడుకలకు కాచిగూడ నుంచి ఎక్కాల కన్నా ఆధ్వర్యంలో కురుమ సంఘం నేతలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎక్కాల కన్నా మాట్లాడుతూ, పోరాట వీరుల చరిత్రను ప్రపంచానికి తెలియకుండా గత పాలకులు అడ్డుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పోరాట యోధులకు సముచిత గౌరవం కల్పిస్తున్నారన్నారు. చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్న, దొడ్డి కొమరయ్య వంటి వీరుల పోరాటాలకు గుర్తింపుగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే నని ఆయన పేర్కొన్నారు.

పదోతరగతి పరీక్షలు ప్రశాంతం



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

నల్లకుంట: పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆలస్యమైతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమంటూ ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించిన నేపథ్యంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. తమ పిల్లలను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు చుట్టు పక్కల చెట్లు, ఇళ్ల ఎదుట పడిగాపులు కాశారు. పరీక్ష ప్రారంభమైన కొద్ది సేపటికే పరీక్షా పత్రం లీకైందంటూ సోషల్ (వాట్సప్) మీడియాలో రావడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వాట్సప్ ద్వారా లీకైన పేపర్ హైదరాబాద్ జిల్లాకు సంబంధించినది కాదని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డివిజన్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద నల్లకుంట, కాచిగూడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కవాడిగూడ: పదోతరగతి వార్షిక పరీక్షలు ముషీరాబాద్ విద్యామండలి జోన్ పరిధిలో ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. ఐదు నిమిషాల నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులంతా నిర్ణీత సమయం కంటే గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ముషీరాబాద్ జోన్ పరిధిలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 5 ఎయిడెడ్, వందకు పైగా ప్రైవేటు పాఠశాలల్లో కలిసి ఈ ఏడాది మొత్తం 4863 మంది విద్యార్థులకు 4841 మంది విద్యార్థులు హాజరై తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షను ప్రశాంతంగా రాశారు. 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిప్యూటీ ఈవో చిరంజీవి ప్రకటించారు. మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. పలు పరీక్షా కేంద్రాలను ముషీరాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక వసతులతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసుల బందోబస్తు చేపట్టారు. కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జామై ఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు భోలక్‌పూర్ అంజుమాన్ బాలుర, బాలికల పాఠశాలలు, ముషీరాబాద్‌లోని రాంనగర్ సెయింట్ పాయిస్టూ స్కూల్, సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అసిసీస్, మదర్స్, హోలీ ట్రినిటీ, గౌతం తదితర ప్రైవేటు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. దీంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది.

విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్' ..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని గౌతమీస్కూల్‌లో పదోతరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ కలిసి 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, నవీన్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఓయూ మెట్లబావి పునరుద్ధరణకు చర్యలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బీఈడీ కాలేజీలోని పురాతన మెట్లబావి పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారి కల్పన రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులతో కలిసి మెట్లబావిని సందర్శించి మాట్లాడారు. నగరంలో 80 పురాతన మెట్లబావులు ఉన్నాయని అందులో ఇంత వరకు 10 బావులకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించామన్నారు. బన్సీలాల్‌పేట మెట్లబావి తరహాలోనే ఇతర మెట్ల బావులను జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల సహకారంతో సుందరీకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఓయూ విద్యార్థులు, అధికారులతో పాటు జీహెచ్ఎంసీ, ఎచ్ఎండీఏ అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మెట్ల బావి చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు జలమండలి మారేడుపల్లి డివిజన్ జీఎం రమణారెడ్డిని కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి అడ్డగుట్టలోని మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ పైప్‌లైన్, వాల్వ్, బోర్‌వెల్స్ మరమ్మతులపై చర్చించారు. అవసరం ఉన్న చోట వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవిలో ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకుంటే నీటి ఎద్దడిని నివారించవచ్చని వినతిలో పేర్కొన్నారు.